## క్లుప్తంగా

### గొల్లప్రోలు ఎంపీడీవోగా భావన


భావన

కొత్తపల్లి: గొల్లప్రోలు ఎంపీడీవోగా ట్రైనీ కలెక్టర్ హెచ్ ఎస్ భావన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆమె ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ చదివారు. 2023లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. కలెక్టర్ ట్రైనింగ్‌లో భాగంగా జనవరి 15వ తేదీ వరకు ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలను నిర్వహించనున్నారు.

### 26న దుకాణాల ఏర్పాటుకు వేలం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 26వ తేదీన ఏడాది పాటు వ్యాపారం చేసుకోవడానికి టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అరటి పండ్లు, కొబ్బరి కాయలు విక్రయం, ఆవునెయ్యి దీపాలు, అల్పాహారం, డ్రింక్ అమ్మకం, చెప్పుల భద్రపర్చు దుకాణం, సైకిలు స్టాండ్‌తో పాటు ఆలయంలో కొట్టిన కొబ్బరి కాయలలో అర చెక్క తీసుకు పోవడానికి టెండర్ కమ్ బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు డిపాజిట్లు చెల్లించి ఈ పాటలో పాల్గొనాలన్నారు. 2025 జనవరి ఒకటి నుంచి డిసెంబరు 31 వరకు వ్యాపారాలకు షాపులు ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు.

### సీపీఎం జిల్లా కార్యదర్శిగా ప్రసాదరావు


కరణం ప్రసాదరావు

సామర్లకోట: సీపీఎం సీనియర్ నాయకుడు కరణం ప్రసాదరావును కాకినాడ జిల్లా కార్యదర్శిగా నియమించారు. పెద్దాపురంలో జరిగిన సీపీఎం 24 జిల్లా మహాసభలు ముగింపు సందర్భంగా సోమవారం కీలకమైన కమిటీలను ఏర్పాటు చేశారు. గత 30 ఏళ్లుగా ప్రజా ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రసాదరావు, కౌన్సిలర్‌గా అనేక సేవలు అందించారని ఏపీబీసీఎల్ హమాలీస్ వర్కర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు అన్నారు. ఈ మేరకు సీపీఎం నాయకులు కరణం గోవిందరావు, ఎస్కే ఫాతిమా, బాలం శ్రీనివాసు, నరవ సురేష్, కరణం శ్రీనివాసరావు తదితరులు ప్రసాదరావును అభినందించారు.

### సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా సూరిబాబు


నీలపాల సూరిబాబు

పెద్దాపురం: సీపీఎం కాకినాడ జిల్లా కమిటీ సభ్యుడిగా పెద్దాపురం పట్టణానికి చెందిన నీలపాల సూరిబాబు ఎన్నికయ్యారు. సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీలో జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైనట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎన్నికైన సూరిబాబును సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, డి.సత్యానారాయణ, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, కూనిరెడ్డి అరుణ, అప్పన్న తదితరులు అభినందించారు.

### సారాతో వ్యక్తి అరెస్టు


సారాతో వ్యక్తిని అదుపులో తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

సామర్లకోట: కాపవరం గ్రామంలో సారా విక్రయిస్తున్న నూతలపాటి వాడపల్లి వ్యక్తిని అరెస్టు చేసినట్టు కాకినాడ ఎక్సైజ్ సీఐ రామోహనరావు తెలిపారు. మండల పరిధిలో సారా అమ్మకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల సారాతో వాడపల్లిని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

### కెనాల్ రోడ్డులో ట్రాక్టరు బోల్తా


కెనాల్ రోడ్డులో హుస్సేన్‌పురం వద్ద బోల్తా పడిన ట్రాక్టరు

సామర్లకోట: ట్రాక్టరును సామర్లకోటలో మరమ్మతులు చేయించి తిరిగి స్వగ్రామమైన హుస్సేన్‌పురం వస్తుండగా కెనాల్ రోడ్డులో ఖాళీ ట్రాక్టరు బోల్తా పడడంతో డ్రైవర్ కోట శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం స్థానికుల కథనం ప్రకారం.. హుస్సేన్‌పురం బాలిబాట వంతెన దాటిన తరువాత ఎదురుగా వస్తున్న భారీ వాహనాన్ని తప్పించే క్రమంలో ట్రాక్టరు అదుపు తప్పి బోల్తా పడింది. గ్రామానికి చెందిన చల్లా బుజ్జి అతని అనుచరులు క్షతగాత్రుడు శ్రీనును సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సిబ్బంది వెంటనే వైద్య ప్రారంభించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడినట్టు బుజ్జి తెలిపాడు.

# తీరానికి రక్షణ కరవు

- ప్రమాదకరంగా మారిన ఉప్పాడ సాగరతీరం
- పూర్తిగా తెగిన రక్షణ'వల'యం
- ఆందోళన చెందుతున్న మత్స్యకారులు


జియోట్యూబ్ తెగిపోవడంతో కోతకు గురైన ఉప్పాడ తీరప్రాంతం


రక్షణ గోడ లేకపోవడంతో సముద్ర గర్భంలో కలుస్తున్న గృహాలు

కొత్తపల్లి: తీరప్రాంతానికి రక్షణ కరువైంది. మండలంలో ఉప్పాడ తీరాన్ని రక్షించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో నిర్మించిన జియో ట్యూబ్ (రక్షణగోడ) తాడు తెగిపోవడంతో ప్రజలకు ఆటుపోట్లు మొదలయ్యాయి. ఉప్పాడ తీరప్రాంతంలోని మత్స్యకార ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఎన్నో భారీ తుపానులు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లను ఈ రక్షణ గోడ ఎదుర్కొంది.

**పర్యవేక్షణ లేకపోవడంతో..**

తీరంలో రక్షణ గోడ నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకూ అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో సుమారు రూ.12 కోట్లు వెచ్చించి జియోట్యూబ్ టెక్నాలజీతో నిర్మించిన రక్షణ గోడ ప్రస్తుతం సాగర గర్భంలో కలసిపోతోంది. రోజురోజుకూ గోడ నిర్మాణానికి ఉపయోగించిన నైలాన్ తాడు తెగిపోతోంది. రాళ్లు చెల్లాచెదురై తీరప్రాంతం కోతకు గురవుతోంది. ఇప్పటికే ఉప్పాడలో మూడొంతుల తీరం సముద్రంలో కలిసిపోయింది. తుపానులు వచ్చినప్పుడల్లా తీరం కోతకు గురికావడం, అధికారులు, రాజకీయ నాయకులు వచ్చి మత్స్యకారులకు హామీలివ్వడం పరిపాటిగా మారింది. ఇప్పటికే తీరప్రాంతంలో అనేక బృందాలు పర్యటించాయి. కాగా తీరం రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఉప్పాడ గ్రామం కనుమరుగవుతుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 సంవత్సరాల్లో ఏడాదికి 3 నుంచి 5 తుపానుల చొప్పున ఇప్పటి వరకూ 120కి పైగా సంభవించాయని మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో ఈ తీరప్రాంతంలో 3 ట్రావెల్ బంగ్లాలు, 2 పోగాకు బీడు కేంద్రాలు, సుమారు 150 ఎకరాలకు పైగా సరుగుడు తోటలు, 300లకు పైగా గృహాలు సముద్ర గర్భంలో కలసిపోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.12 కోట్లతో...**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మాజీ కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి ఎంఎం పళ్లం రాజు చొరవతో సుమారు రూ.12 కోట్ల వెచ్చించి ఉప్పాడ తీరప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర రక్షణగోడ నిర్మించారు. జల్, లైలా, థేన్ తుపాన్లతో పాటు విలయం సృష్టించిన హుదూహుద్, ఫణి తుపాన్ నుంచి ఉప్పాడ తీరప్రాంతం కోతకు గురికాకుండా ఈ గోడ రక్షణగా నిలిచింది. ఉప్పాడ గ్రామ ప్రజలతో పాటు వారి ఆస్తులను కాపాడగలిగింది. గత టీడీపీ ప్రభుత్వంలో రక్షణ గోడపై పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా సముద్ర గర్భంలో కలిసిపోయింది.

### రక్షణ చర్యలు చేపట్టాలి



తీరప్రాంతం కోతకు గురికాకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలి. తుపానులు, సముద్రంలో సంభవించే ఆటుపోట్లకు తీరప్రాంతం కోతకు గురవుతూనే ఉంది. ఇప్పటికే వందలాది గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. గడిచిన రెండు నెలల్లో వచ్చిన తుపానుల కారణంగా ఉప్పాడ, కోనపాపపేట గ్రామాల్లో సుమారు 50 గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. మహానేత వైఎస్సార్ చొరవతో నిర్మించిన జియోట్యూబ్ ఇప్పటివరకూ తీరప్రాంతానికి రక్షణగా నిలిచింది. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి ఉంటే రక్షణ గోడ నిలిచి ఉండేది.

మేరుగు ఎల్లాజీ, ఎంపీటీసీ సభ్యుడు, ఉప్పాడ

### పవన్ మాటలు ప్రకటనలకే పరిమితం



రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉప్పాడ తీర ప్రాంతానికి వచ్చారు. స్థానికంగా ఉన్న మత్స్యకారుల సమస్యలపై అడగకుండా అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి వెళ్లారు. తీరప్రాంతానికి రక్షణ కల్పిస్తామని ఆయన చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ కల్పిస్తుందనేది ప్రశ్నార్థకమే. గృహాలు కోతకు గురికావడంతో మత్స్యకారులు వలస పోతున్నారు. గంగపుత్రులు తలదాచుకునేందుకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు.

ఉమ్మిడి జాన్, మాజీ ఎంపీటీసీ, మత్స్యకార నాయకుడు, ఉప్పాడ

## వినియోగదారుల చట్టంపై అవగాహన ఉండాలి


వినియోగదారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: వినియోగదారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు బి.సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ 2019 వినియోగదారుల చట్టం, ఫిర్యాదుల పరిష్కారం అంశంపై మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. దీని కోసం వినియోగదారుల సంఘం ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వినియోగం దారుల సంఘం కమిషన్ సభ్యులు చెక్కా శౌ, డీసీబీసీ సభ్యులు ఎం.భాస్కరరావు, టి.సత్యనారాయణ, శివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే పీజీఆర్ఎస్ గ్రీవెన్స్

- పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి
- గ్రీవెన్స్‌కు ఎనిమిది అర్జీలు


పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)) కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులకు పీజీఆర్జీఎస్‌కు అందుబాటులో ఉంటారన్నారు. పీజీఆర్జీఎస్‌లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారిపై ఉంటుందన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు ఎనిమిది ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, డీవైఈఓ శర్మ, చప్పిడి రాజు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రైతును గుర్తించాలి

- డీవైఈఓ వెంకటేశ్వరరావు
- రైతు దినోత్సవాన్ని ప్రారంభించిన డీఎస్పీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈఓ నాయుడు వెంకటేశ్వరరావు, చిత్రంలో డీఎస్పీ తదితరులు

సామర్లకోట: ప్రతి ఒక్కరూ రైతు కష్టం గురించి తెలుసుకోవాలని డీవైఈఓ నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక మెహర్‌కాంప్లెక్స్‌లోని వివేకానంద స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని డీఎస్పీ డి శ్రీహరిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పండించే వివిధ రకాల పంటల ఎగ్జిబిషన్‌ను డీఎస్పీ, డీవైఈఓ, ఎంఈఓలు తిలకించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆహారం పంటలతో పాటు వాణిజ్య పంటలు పండించే సదుపాయాలు కేవలం భారతదేశంలో మాత్రమే ఉన్నాయని తెలిపారు. రైతు పంటలు పండించక పోతే తిండి ఉండదని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతును గౌరవించాలన్నారు. డీఎస్పీ శ్రీహరిరాజు ఎగ్జిబిషన్‌లో ఉంచిన ఆహార పదార్థాలను పరిశీలించి వాటిని ఏవిధంగా పండిస్తారు, వాటి వలన ప్రయోజనం ఏమిటనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనలో 174 రకాల పంటలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, డైరెక్టరు సరోజని, హెచ్ఎం వికాస, సీఐ ఎ.కృష్ణభగవాన్, ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య, ఎంఈఓ-2 పి.పుల్లయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల కిరణ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామిలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందజేసిన రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక చైర్మన్, ఉపాధ్యాయులు

సామర్లకోట: మారుతున్న కాలంలో ప్రతి విద్యార్థి సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టరు కేవీవీ సత్యనారాయణ అన్నారు. గణిత దినోత్సవం ముగింపు సందర్భంగా స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే గణిత భావనలపై పట్టు పెంచుకోవడం ద్వారా సులభంగా కోరిన లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు తయారు చేసిన పలు మోడల్స్‌ను ఆయన తిలకించి, అభినందించారు. కొత్త సంవత్సరం 2025 వచ్చేలా విద్యార్థులు చేసిన ప్రాజెక్టు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ మేరకు మేథ మెజిషియన్ తోటకూర సాయిరామకృష్ణ అంకెల తమాసాలతో అలరించారు. గణిత ఉపాధ్యాయులు కె.అరుణ, ఎ.శ్రీవల్లి శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గణిత నృత్యాలు, గణిత పాటు, ఏకపాత్రాభినయం అలరించాయి. గత ఆరు రోజులుగా విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

## ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకే తప్పుడు ప్రచారం

మత్స్యకార నాయకుడు వెంకటరమణ


కోనపాపపేట సమావేశంలో మాట్లాడుతూన్న మత్స్యకార నాయకుడు వెంకటరమణ

కొత్తపల్లి: తీర ప్రాంతంలో కాలుష్య పరిశ్రమలు నిర్మించడం వలన సముద్రంలో మత్స్య సంపద అందరించిపోయి రానున్న రోజుల్లో మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మూరుతుందని మత్స్యకార నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు వ్యతిరేకంగా పోరాడుతుంటే కొంతమంది ఫ్యాక్టరీ యాజమాన్యంతో ఒప్పందాలు కుదుర్చుకోవడం, తమను ఊరు నుంచి బహిష్కరించారంటూ తప్పుడు ఆరోపణలు చేయడం ద్వారా ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మత్స్యకార నాయకుడు కొర్ని వెంకట రమణ అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో రామాలయం వద్ద పార్టీలకు అతీతంగా మత్స్యకార నాయకులు సోమవారం సమావేశం నిర్వహించారు. కాలుష్య పరిశ్రమల యాజమాన్యం నుంచి రూ.6 కోట్లు మాముళ్ల తీసుకొన్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామానికి చెందిన మత్స్యకారులు గ్రామంలో న్యాయంగా పోరాటం చేస్తుంటే వారిపై కొందరు తప్పుడు ఆరోపణలు చేసున్నారన్నారు. తమను ఊరు నుంచి బహిష్కరించారంటూ కుల పెద్దలపై ఆరోపణలు చేసి ఉద్యమం చేస్తున్న నాయకులను అనగదొక్కేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ శుభ పరిణామం క్రీస్తు జననం

- సుందరంగా ముస్తాబైన చర్చిలు
- గ్రామాల్లో సందడి వాతావరణం


ఉప్పాడలో విద్యుత్ కాంతులతో బాప్టిస్టు చర్చి


క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న శామ్యూల్ సుదీప్

పెద్దాపురం: యావత్ ప్రపంచానికి క్రీస్తు జననం ఓ మంచి పరిణామం అని కాంతి చానెల్ టీవీ ప్రసంగీకులు టి.మోజెస్ అభిషేక్, క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం అన్నారు. క్రిస్మస్ ఆరాధనల్లో భాగంగా చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో వారు ప్రసంగించారు. నంగిన సత్యానందం, శాంతకుమారి దంపతులు కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దైవజనులు వంకా జాన్, కె.అభిషేక్, శాంతివర్ధన విభిన్న ప్రతిభా వంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, పాస్టరమ్మలు నంగిన ప్రేమలత, విశాల, వంకా రూత్ ప్రశాంతి, మేరీ, ఒబలిశెట్టి వీరలక్ష్మి, బొండల త్రిమూర్తులు, పోలవరపు పైడిరాజు, తిరుపతి, చదలాడ, విరవ, దివిలి గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ నెల 25న క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులు చర్చిలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఏసు క్రీస్తు జన్మదినాన్ని ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో ఇప్పటికే పెద్దపెద్ద స్టార్‌లను ఏర్పాటు చేశారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే లైట్లతో కూడిన తారలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మండల పరిధిలోని ప్రార్థనా మందిరాలను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దారు. ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాద్, మూలపేట, పొన్నాడ, నాగులపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రకాలు విద్యుత్ దీపాలంకరణలతో చర్చిలు కళకళలాడుతున్నాయి. అన్నిచర్చిల్లోనూ వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

కొత్తపల్లి: పాఠశాలల్లో మతపరమైన వేడుకలు నిర్వహించరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు బేఖాతర్ చేస్తూ మండలంలోని మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం జి.శ్రీనివాస్ కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు తినిపించారు. దీనిపై మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌ను వివరణ కోరగా పాఠశాలలో మతపరమై కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు.

## పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ


సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులు కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో ఆలయంలో తెల్లవారు జాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామివారి అభిషేకాలు, పూజలను పిఠాపురం మహారాజా గోత్రనామాలతో నిర్వహించారు. ఆలయంలో లక్షపత్రి పూజ జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి సుందరరామయ్య, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

## డ్రైనులో పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లోని డ్రైనులో పూడికతీత పనులను సోమవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. కూరగాయల మార్కెట్ నుంచి నీలమ్మ చెరువు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేసినా భారీ వర్షాలు కురిసిన సమయంలో ఆ రోడ్డు చెరువుగా మారి పోతుంది. దాంతో కూరగాయల మార్కెట్ నుంచి మఠంసెంటర్ వరకు ఉన్న డ్రైను లో పూడిక నిలిచిపోయింది. ఈ పూడిక తీత పనులను ఇటీవల మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య చేయించారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, గౌడ కార్పోరేషన్ డైరెక్టరు బడుగు శ్రీకాంత్, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రథయాత్ర


గొల్లప్రోలు పట్టణంలో స్వామివారి రథయాత్ర

కొత్తపల్లి: గొల్లప్రోలు పట్టణంలో సోమవారం శివుని రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శక్తివంతమైన సోమనాదీశ్వర వజ్రలింగాన్ని భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. అనంతరం రథయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇప్పటివరకు 60 వేల గ్రామాల్లో ఈ రథయాత్ర నిర్వహించినట్లు బ్రహ్మకుమారీలు తెలిపారు. మంగళవారం చేబ్రోలు, దుర్గాడ గ్రామాల్లో రథయాత్ర నిర్వహించనున్నట్టు చెప్పారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


వీకే రాయపురంలో ప్రజల సమస్య తెలుసుకొంటున్న తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: రైతుల భూమి సమస్యలు పరిష్కారించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. మండల పరిధిలో సోమవారం వీకే రాయపురం పంచాయతీలో నిర్వహించిన సదస్సు కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఎవరికి ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ సదస్సులో వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన రైతుల నుంచి 20 అర్జీలు వచ్చాయని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో కాలభైరవునికి పూజలు


పూలు, గారెలతో సామర్లకోటలోని కాలభైరవస్వామి అలంకరణ

సామర్లకోట: కాల భైరవ అష్టమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న కాలభైరవ స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మార్గశిర మాసంలో వచ్చే తొలి అష్టమిని కాలభైరవ అష్టమిగా జరుపుకొంటున్నారు. ఈ మేరకు కాలభైరవ స్వామి ఆలయాన్ని పూలతో అలంకరించారు. శివుడిని దర్శించుకునే ముందుగా కాలభైరవ స్వామిని దర్శించుకోవాల్సిన ఉంటుంది. దీనిలో భాగంగానే ఆలయంలో ప్రవేశించగానే కాలభైరవ స్వామి ఆలయాన్ని నిర్మాణం చేశారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు. అనంతరం భక్తులు తీసుకొని వచ్చిన గారెలు, పూల దండలతోను పట్టు వస్త్రాలతోను అలంకరణ చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ కంటేబాబు, భక్త సంఘం సభ్యులు బిక్కిన పరమేశ్వరసాయి, చలికి వీరేంద్ర, బీవీ రమణ, చల్లా సత్తిబాబు, నాతిపాముల సూరిబాబులు భక్తులకు సేవలందించారు. ఆలయ పండితులు వేమూరి సోమశ్వర శర్మ, అళ్లకి రాజ్‌గోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామికి ప్రీతైన రోజు కావడంతో అధిక సంఖ్యలో ఆలయానికి భక్తులు తరలి వచ్చారు.

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కాలభైరవస్వామిని, స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు.